

చకచకా నిర్మాణం

దుందుబీ వాగుపై చెక్‌డ్యాం కం బ్రిడ్జి నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి.

వివరాలు 10లో ▸



భవితకు బాటలు

డీవైఎస్‌ఓ నిర్వహిస్తున్న వేసవి శిబిరాలు చిన్నారుల భవితకు బాటలు వేస్తున్నాయి.

వివరాలు 12లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.1 /27.3

ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గురుకుల ఉద్యోగ పరీక్షకు ఉచిత శిక్షణ

వనపర్తి: గురుకుల ఉపాధ్యాయ పరీక్షకు బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి అనిల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28లోపు దరఖాస్తు చేసుకున్న వారికి జూన్ మొదటి వారం నుంచి ప్రారంభమయ్యే తరగతులకు హాజరయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వనపర్తి, గద్వాల జిల్లాల అభ్యర్థులకు గద్వాలలోని టీటీఎన్ బిల్డింగ్, పాత ఎల్‌ఐసీ ఆఫీస్, మొదటి రైల్వేగేట్ దగ్గర ఉన్న బీసీ స్టడీసర్కిల్ కార్యాలయంలో తరగతులు కొనసాగుతాయని.. డిగ్రీ, బీఎడ్ మార్కుల ఆధారంగా ఏజెన్సీ ఎంపిక చేస్తుందన్నారు.

వాటరింగ్‌లో భాగస్వాములవ్వాలి

వనపర్తి: వేసవి తీవ్రత అధికంగా ఉన్నందున శుక్రవారం నుంచి వరుసగా మూడురోజుల పాటు మొక్కలకు నీటిని అందించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గత హరితహారంలో నాటిన ప్రతి మొక్కను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని.. ఎండల తీవ్రతకు మొక్కలు చనిపోయే ప్రమాదం ఉన్నందున జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు, ప్రభుత్వ సిబ్బంది వాటరింగ్‌లో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు.


పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



కొత్తకోట: నియోజకవర్గంలోని పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రొసీడింగ్ కాపీలను అందజేసి మాట్లాడారు. పట్టణంలోని జామే మసీద్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు, కానాయపల్లి ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో గ్రావెల్ పనులకు రూ.10 లక్షలు, అయ్యప్ప ఆలయంలో భోజనశాల నిర్మాణానికి రూ.18 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ పార్టీకి దేశంలోనే మంచి భవిష్యత్ ఉందన్నారు. తొమ్మిదేళ్లలో అన్ని పురపాలికలు ఎంతో అభివృద్ధి చెందాయని.. ముఖ్యంగా కొత్తకోట దినదినాభివృద్ధి చెందుతోందని, జనాభాకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. అందరి అండతోనే ఎమ్మెల్యేగా రెండుసార్లు విజయం సాధించినట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కూడా బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, వైస్ ఎంపీపీ వడ్డె శ్రీనివాసులు, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ సుఖేశిని, మదనాపురం మార్కెట్ చైర్మన్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాలనారాయణ, నాయకులు గాడీల ప్రశాంత్, శ్రీనుజీ తదితరులు పాల్గొన్నారు.

'బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి'

వనపర్తిటౌన్: పదిహేనేళ్లుగా ఎంఈఓల బదిలీలు, ఆరేళ్లుగా సాధారణ బదిలీలు, ఎనిమిదేళ్లుగా పదోన్నతులు చేపట్టకపోవడం ప్రభుత్వానికి సిగ్గుచేటని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానంద, గౌరవ ప్రధానకార్యదర్శి పర్వత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఎస్టీయూ భవనంలో శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం తక్షణమే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. జులై నుంచి పీఆర్సీ అమలు చేయాలని, డీఏ తదితర పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నీ చెల్లించాలన్నారు.



ధాన్యం.. ఇదేమి దైన్యం?



మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలకేంద్రంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో నలుగురు రైతులు వెంకటేశ్, సుగ్రీవులు, చుక్కమ్మ, రాంరెడ్డి 705 బస్తాల ధాన్యాన్ని విక్రయించారు. మొత్తం 282 క్వింటాళ్లు కాగా.. ఓ రైస్ మిల్లుకు తరలించారు. సదరు మిల్లర్ 8 క్వింటాళ్ల తరుగు తీసి 686 బస్తాలకు మాత్రమే లెక్కగట్టి ట్రక్‌షీట్‌పై రౌండప్ చేసి రైతులకు పంపించారు. దాదాపు రూ.16వేలు నష్టపోవడంతో సదరు రైతులు కంగుతిన్నారు.

అన్నదాతలకు విక్రయ తంటాలు

- మిల్లర్లదే ఇష్టారాజ్యం.. భారీగా దోపిడీ
- క్వింటాల్‌కు 5 నుంచి 6 కిలోల తరుగు
- అలా అయితేనే కొనుగోలు
- పలు ప్రాంతాల్లో గన్నీ బ్యాగుల కొరత
- సెంటర్లలో రోజుల తరబడి రైతుల పడిగాపులు

మరో 10, 15 రోజుల్లో వర్షాకాలం సీజన్ రానుంది. అయినా.. ఎండాకాలం సాగుకు సంబంధించి ధాన్యం కొనుగోళ్లు ఇంకా ఊపందుకోలేదు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో ధాన్యం తడవడం, పీడిస్తున్న గన్నీ బ్యాగుల కొరత, ట్రాన్స్‌పోర్ట్ ఇబ్బందుల వంటివి తలెత్తినా.. ధనదాహంతో మిల్లర్లు పెడుతున్న కొర్రీలే జాప్యానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. 40 కిలోల బస్తాకు రెండు నుంచి మూడు కిలోల తరుగుకు ఒప్పుకుంటేనే కొనుగోలు చేస్తామని కరాఖండిగా చెబుతూ.. అన్నదాతలకు విధిలేని పరిస్థితులు సృష్టిస్తున్నారు. అధికారులు సైతం మిల్లుల యజమానులకే వత్తాసు పలుకుతుండడంతో రైతులు చేసేదేమీ లేక ఎంతో కొంతకు అమ్ముకుంటున్నారు. ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాలోనూ ఇదే పరిస్థితి నెలకొనగా.. అన్నదాతల దీనావస్థపై 'సాక్షి' ఫోకస్..

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

సాక్షి ఫోకస్

మహబూబ్‌నగర్ జిల్లాలో ధాన్యం సేకరణలో జాప్యం జరగడం లేదు. అయితే మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ భారీగా దోపిడీ చేస్తున్నారు. తాలు, తేమ పేరిట కొర్రీలు పెడుతూ ప్రాంతాన్ని బట్టి బస్తాకు మూడు నుంచి ఐదు కిలోల మేర తరుగు తీస్తున్నారు. రైతులు ఒప్పుకోని పక్షంలో కొనుగోలు చేని పరిస్థితి ఉంది. అకాల వర్షాల నేపథ్యంలో మరింత నష్టపోవాల్సి వస్తుందని అన్నదాతలు ఎంతో కొంతకు అమ్ముకుంటున్నారు.

■ జోగుళాంబ గద్వాల జిల్లాలో ధాన్యం సేకరణ లక్ష్యం మేరకు సుమారు 45 లక్షల గన్నీ బ్యాగులు అవసరం కాగా.. 27 లక్షలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సెంటర్ల ద్వారా ఇప్పటి వరకు కేవలం 4,350 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ముందుగా కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్‌కు రైతులు సన్న ధాన్యాన్ని తరలించారు. అక్కడ క్వింటాల్‌కు మద్దతు ధర రూ.2300–2,400 పలకడంతో సుమారు 50శాతం మేర బయటకి వెళ్లినట్లు అంచనా. అకాల వర్షానికి రాయచూర్‌లో ఒక్కసారిగా ధర రూ.1,600వరకు పడిపోవడంతో రైతులు స్థానికంగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలిస్తున్నారు. ఇలా 40 నుంచి 50 శాతం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రాగా.. మిల్లర్లు తరుగు పేరిట కొర్రీలు పెడుతున్నారు. మద్దతు ధర రూ.2,060 కాగా.. కనీసం రూ.200 నుంచి రూ.300 తక్కువతో కొనుగోలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.



వనపర్తి మండలం చిట్యాల శివారులోని కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం తరలింపు

ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల వివరాలు..

జిల్లా	కొనుగోలు కేంద్రాలు	ప్రారంభమైన సెంటర్లు	సేకరణ లక్ష్యం (మెట్రిక్ టన్నులు)	సేకరించింది (మెట్రిక్ టన్నులు)
మహబూబ్‌నగర్	199	199	1.50 లక్షలు	53 వేలు
నాగర్‌కర్నూల్	214	214	3.39 లక్షలు	30,798
వనపర్తి	259	250	4.00 లక్షలు	1.5 లక్షలు
జోగులాంబ గద్వాల	72	42	1.75 లక్షలు	4,350
నారాయణపేట	102	99	2.50 లక్షలు	37,863

■ వనపర్తి జిల్లాలో కొనుగోళ్లు నెమ్మదించడానికి ప్రధాన కారణం మిల్లుల వద్ద ధాన్యం దించుకోకపోవడమే. తూకం చేసిన బస్తాలను సకాలంలో అన్‌లోడ్ చేయకపోవడంతో సమస్య నెలకొంది. అదేవిధంగా జిల్లాలో ధాన్యం సేకరణ లక్ష్యానికి అనుగుణంగా కోటి గన్నీ బ్యాగులు అవసరం కాగా.. 75.50 లక్షలు మాత్రమే వచ్చాయి. గన్నీ సంచుల సమస్యతో పాటు తాలు, తడిసిందని కొర్రీలు పెడుతూ మిల్లర్లు లారీకి 4 నుంచి 5 క్వింటాళ్ల వరకు తరుగు తీస్తుండడంతో రైతులు భారీగా నష్టపోతున్నారు.

■ నారాయణపేటలో తెలంగాణ సోనా ఆర్‌ఎన్‌ఆర్‌కు మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో రైతులు జిల్లాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడం లేదు. రాయచూరు, నారాయణపేట మార్కెట్ యార్డుల్లో నేరుగా క్వింటాల్‌కు రూ.2,100 నుంచి రూ.2,200 ధరతో మిల్లర్లకే అమ్ముతున్నారు. ఈ క్రమంలో హంస రకానికి చెందిన వడ్లు మాత్రమే ఎక్కువగా కొనుగోలు కేంద్రాలకు వస్తున్నాయి. పలు చోట్ల మిల్లర్లు తరుగుపేరిట కొర్రీలు పెడుతుండడంతో కొనుగోళ్లలో జాప్యం జరుగుతోంది.

■ నాగర్‌కర్నూల్ జిల్లాలో.. అచ్చంపేట మండలం నడింపల్లి రైతువేదిక వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో దాదాపు వారం రోజులు గడిచినా ధాన్యం కొనుగోళ్లు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకవేళ కొన్నా 40 కిలోల బస్తాకు రెండు కిలోలకు పైగా తరుగు తీయడంతో పాటు హమాలీ చార్జీల కింద బస్తాకు రూ.18చొప్పున వసూలు చేస్తున్నారు. ధాన్యం మీద కప్పేందుకు టార్పాలిన్లు కూడా ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపుగా జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యంతో కొంతమంది రైతులు తక్కువ ధరకే నేరుగా మిల్లర్లకు అమ్ముకుంటున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు..



మహమ్మదాబాద్ సెంటర్ నుంచి 205 బ్యాగులను తూకం చేయగా.. మూడు క్వింటాళ్ల ధాన్యం తరుగు తీశారు. సుమారు రూ.6వేల వరకు నష్టం వచ్చింది. ఎంతో కష్టపడి మూడు ఎకరాల్లో వరి సాగు చేశాను. పెట్టుబడి ఖర్చులు తీయగా.. మిగిలింది ఏమీ లేదు. ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి కొన్నట్టే కానీ మిల్లర్లు రైతుల నడ్డి విరుస్తున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదు. మిల్లర్లకు మద్దతు పలుకుతున్నారు.

– పసుపుల రాంచంద్రయ్య, రైతు, మహమ్మదాబాద్, మహబూబ్‌నగర్

7 రోజులుగా పడిగాపులు..



నాకున్న ఎకరన్నరలో వారి పండిస్తే 50 ధాన్యం బస్తాల దిగుబడి వచ్చింది. వీటిని కర్ణాటకలోని రాయచూరు మార్కెట్‌కు తీసుకెళ్లితే.. రూ.1,600 అడిగారు. రేటు గిట్టుబాటు కాకపోవడంతో తిరిగి ధాన్యాన్ని కేటీదొడ్డి కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చినా.. గన్నీ బాగ్‌లు లేవని.. ఈ రోజు, రేపొస్తాయి అంటూ సిబ్బంది దాటవేస్తున్నారు. వారం నుంచి వడ్ల కుప్ప దగ్గర పడిగాపులు కాస్తున్నా.

– వీరన్నగౌడ్, రైతు, కేటీదొడ్డి, జోగుళాంబ గద్వాల

క్వింటాల్‌కు 5 కిలోల తరుగు..



పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు మండుటెండల్లో అవస్థలు పడుతున్నాం. రెండు ట్రాక్టర్ల ధాన్యాన్ని రెండు రోజుల క్రితం మండల కేంద్రంలోని మిల్లుకు తీసుకొచ్చా. టార్గెట్ అయిపోయింది.. మేము తీసుకోమని మిల్లర్లు చెప్పడంతో వారిని బతిమిలాడి ఎలాగోలాగా ధాన్యం అన్‌లోడ్ చేశాం. క్వింటాల్‌కు ఐదు కిలోల చొప్పున తరుగు తీశారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాలాంటి రైతుల గురించి ఆలోచన చేయడం లేదు.

– వెంకటయ్య, రైతు, జంగంరెడ్డిపల్లి, నర్వ, నారాయణపేట



మహబూబ్‌నగర్ మార్కెట్‌యార్డులోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ఇలా..

20 రోజులైంది.. అయినా కొంటలేరు..



నేను మూడెకరాల్లో వరి సాగు చేశాను. సమీపంలోని కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తెచ్చి 20 రోజులు అయింది. అయినా కొనుగోలు చేయడం లేదు. వర్షం ఎప్పుడొస్తుందో తెలియక కుప్పల వద్దే నిద్రపోతున్నా. అధికారులు పట్టించుకోవడం లేదు.

– గద్దమీది మల్లయ్య, రైతు, బిజినేపల్లి, నాగర్‌కర్నూల్

తండాల అభివృద్ధికి పెద్దపీట



వనపర్తికి నీటి సరఫరాను ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: తండాల అభివృద్ధికి తెలంగాణ సర్కార్ పెద్దపీట వేస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చిట్యాల తూర్పుతండాతో రూ. 20 లక్షలతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనం, చిట్యాల నుంచి పడమటి తండా వరకు రూ.43 లక్షలతో బీటీ రహదారి, చిట్యాల నుంచి అచ్యుతాపురం వరకు రూ.1.70 కోట్లతో చేపట్టే బీటీ రోడ్డు, ఆర్‌అండ్‌బీ రోడ్ నుంచి పాపాగనితండాకు రూ.54 లక్షలతో ఏర్పాటు చేయనున్న బీటీ రోడ్డు, చందాపూర్ పంచాయతీరాజ్ రోడ్డు నుంచి దత్తాయపల్లి పెద్దతండా వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తండాలు, గూడెంలను గ్రామపంచాయతీలుగా అప్‌గ్రేడ్ చేసిందని.. దీంతో గిరిజనులు తమ ఆవాస ప్రాంతాన్ని తామే అభివృద్ధి చేసుకొనే వెసులుబాటు కలిగిందన్నారు. మౌలిక వసతులైన విద్యుత్, రోడ్లు, పాఠశాలలు, డ్రెయినేజీలు, మిషన్ భగీరథ, తాగునీరు తదితర సౌకర్యాలు మెరుగుపడ్డాయని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ మల్లయ్య, ఎంపీడీఓ సుదర్శన్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి శాశ్వత పరిష్కారం..

వనపర్తిటౌన్: మరో 15 రోజుల్లో మిషన్ భగీరథ మెయిన్ డిస్ట్రిబ్యూషన్ లైన్ పనులు పూర్తవుతాయని.. జిల్లాలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. గోపాల్‌పేటకు సరఫరా అయ్యే రామన్‌పాడు ప్రధాన పైపులైన్ నుంచి వనపర్తికి తాగునీటి సరఫరాను శుక్రవారం గుంపుగట్టు వద్ద మంత్రి ప్రారంభించి మాట్లాడారు. మిషన్ భగీరథ అదనపు ప్రాజెక్టుకు గతంలో సీఎం కేసీఆర్ రూ.300 కోట్లు మంజూరు చేశారని.. ఆ పనులు విజయవంతంగా పూర్తికావచ్చాయన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని అధికారులకు పదే పదే చెబుతున్నా మరో రెండు వారాల సమయం పడుతుందని చెప్పడం సరికాదని.. పద్ధతి మార్చుకోవాలని అసహనం వ్యక్తం చేశారు. తాగునీటి విషయంలో నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ శ్రీధర్, కమిషనర్ విక్రమసింహారెడ్డి, ఇంజినీర్ భాస్కర్, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, నాగన్న, చీర్ల సత్యం, నక్క రాములు, గులాం ఖాదర్, బీఆర్‌ఎస్ నాయకులు ఉంగ్లం తిరుమల్, స్టార్ రహీం, బీచుపల్లి, ప్రేమ్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

వనపర్తిటౌన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాస్థాయి వ్యాస రచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీలను ఈ నెల 31న నిర్వహించనున్నట్లు డీఈఓ గోవిందరాజులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశానుసారం ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఈ నెల 28లోగా http://forms.gle/D5yhgfxhnz1CAuAc7 వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. పోటీలు జిల్లాకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతాయని వెల్లడించారు. పూర్తి వివరాలకు సెల్‌ఫోన్ నంబర్లు 93945 74814, 94913 77374 సంప్రదించాలని సూచించారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

- జిల్లా వైద్యాధికారి డా. రవిశంకర్

మదనాపురం: హరితహారంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణతో మానవుల మనుగడ ముడిపడి ఉందని జిల్లా వైద్యాధికారి డా. రవిశంకర్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో హరితహారం మొక్కలకు నీరుపోసి మాట్లాడారు. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రైతువేదికలో తిప్పడంపల్లి, అప్పరాల, మదనాపురం, కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పనిచేసే ఆశా కార్యకర్తలకు 'విధులు.. బాధ్యతలు' అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ఆశా కార్యకర్తలు గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు సకాలంలో వైద్యసేవలు అందించడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో డా. భవాని. సూపర్‌వైజర్లు ప్రమీల, స్వరాజ్యలక్ష్మి, హెల్త్‌సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కలకు నీరుపోస్తున్న జిల్లా వైద్యాధికారి డా. రవిశంకర్

పాలిసెట్‌లో ప్రతిభ

- రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన జిల్లా విద్యార్థులు

వనపర్తిటౌన్: పాలిటెక్నిక్, అగ్రికల్చర్, ఫిషరీస్ కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరం ప్రవేశాలకుగాను నిర్వహించిన పాలిసెట్‌లో జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారు. ఈ నెల 17న ప్రవేశ పరీక్ష నిర్వహించగా శుక్రవారం ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్రస్థాయిలో ఎస్. నవ్య ఎంపీసీలో 13వ ర్యాంకు, బైపీసీలో 9వ ర్యాంకు, షైష్త తోహేనియాత్ ఎంపీసీలో 9వ ర్యాంకు, బైపీసీలో 11వ ర్యాంకు, నామాల శ్రీరేణు తేజ ఎంపీసీలో 39వ ర్యాంకు, బైపీసీలో చింత జతిన్ 30వ ర్యాంకు సాధించినట్లు పాలిసెట్ కన్వీనర్ డా. చంద్రశేఖర్ వెల్లడించారు.

జిల్లాలో ఉత్తీర్ణత ఇలా..

ఎంపీసీలో 2,033 మంది విద్యార్థులు ఉత్తీర్ణులవగా 78.92 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇందులో బాలురు 1,051 (75.83%), బాలికలు 982 (82.52%) మంది ఉన్నారు. అదేవిధంగా బైపీసీలో 2,104 మంది విద్యార్థులు ఉత్తీర్ణులవగా 81.68 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇందులో బాలురు 1,087 మంది (78.43%), బాలికలు 1,017 మందికి (85.46%) ఉన్నారు.

ప్రణాళికతో చదివా..



రాష్ట్రస్థాయిలో ఎంపీసీలో 13, బైపీసీలో 9వ ర్యాంకు రావడం సంతోషంగా ఉంది. రోజు నిర్దిష్ట సమయం కేటాయించుకొని ప్రణాళికతో చదవడం ద్వారా విజయం సాధించాను. డిమాండ్ ఉన్న కోర్సులను ఎంచుకొని ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకుంటా.

– ఎస్.నవ్య, చిట్యాల, వనపర్తి

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..



నా విజయం వెనుక తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఎంతో ఉంది. గత మోడల్ పేపర్స్‌ను అధ్యయనం చేస్తూ కొత్త అంశాలను నేర్చుకుంటూ ముందుకుసాగా. టెక్నికల్ ఎడ్యుకేషన్‌లో ఉన్నతస్థాయికి చేరుకొని తోటి వారికి ఆదర్శంగా నిలుస్తా.

– చింత జతిన్, కల్వరాల

ఇంజినీర్ కావాలని..



10వ తరగతి పరీక్షలు పూర్తికాగానే పాలిసెట్‌పై దృష్టి సారించా. రోజు నేర్చుకున్న అంశాలను పునచ్చరణ చేసుకుంటూ ముందుకుసాగా. నాన్న మహ్మద్ ఖాజా వ్యాపారం చేస్తుండగా.. అమ్మ నజీర్ ఉన్నీసాబేగం టీచర్‌గా పనిచేస్తోంది. నా కృషికి ఎంపీసీలో 9, బైపీసీలో 11వ రాష్ట్ర ర్యాంకు వచ్చాయి. ఇంజినీర్ కావాలన్నదే నా లక్ష్యం.

– షైష్త తోహేనియాత్, రాంనగర్, వనపర్తి

సంతోషంగా ఉంది..



ఎంపీసీలో రాష్ట్రస్థాయిలో 39వ ర్యాంకు రావడం సంతోషంగా ఉంది. భవిష్యత్‌లో నన్ను ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఎదిగేలా మారుతా. ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొస్తా.

– నామాల శ్రీరేణు తేజ, ఎన్టీఆర్ కాలనీ, వనపర్తి

ప్రతిష్టాత్మకంగా 'వృక్షమాల'

– డీఆర్‌డీఓ నర్సింహులు

అమరచింత: నదితీర ప్రాంతాల్లో పచ్చదనంతో పాటు తీరం కొట్టుకుపోకుండా ఉండేందుకు ప్రభుత్వం వృక్షమాల కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని డీఆర్డీఓ నర్సింహులు తెలిపారు. శుక్రవారం మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు సమీపంలో దిగువ నదితీర ప్రాంతాల్లో మొక్కలు నాటేందుకు అనువైన ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పీజేపీ క్యాంపు ఇరిగేషన్‌శాఖ పరిధిలోని భూముల్లో మొక్కలు నాటేందుకు పరిశీలిస్తున్నామన్నారు. అనువైన భూములను గుర్తించి పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతి, ఎంపీఓ నర్సింహులు, ఏపీఓ బాలయ్య, ప్లాంటేషన్ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీఓ నర్సింహులు

క్లుప్తంగా

రైలు కిందపడి విద్యార్థి బలవన్మరణం

దేవరకద్ర రూరల్: కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ డిగ్రీ విద్యార్థి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని డోకూరులో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని హజిలాపూర్ గ్రామానికి చెందిన జంగం జయకృష్ణ(20) డిగ్రీ చదువుతున్నాడు. తన పెద్దమ్మ గ్రామమైన డోకూర్‌కు గురువారం వచ్చాడు. ద్విచక్రవాహనం విషయంలో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన జయకృష్ణ శుక్రవారం తెల్లవారుజామున గ్రామ సమీపంలోని రైల్వే పట్టాల దగ్గర గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..

గద్వాల క్రైం: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం మండలంలోని అనంతపురంలో చోటు చేసుకుంది. బంధువులు, ఎస్‌ఐ ఆనంద్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన కుర్వ పరశురాముడి(23)తో అదే గ్రామానికి చెందిన రాణికి గతేడాది వివాహమైంది. ఇటీవల కాన్పు కోసం భార్య పుట్టింటికి వెళ్లింది. కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న క్రమంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరు లేని సమయంలో గురువారం తెల్లవారుజామున ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పరశురాముడికి భార్య, రెండునెలల పాప ఉన్నారు. తండ్రి కుర్వ కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

జడ్చర్ల: హైదరాబాద్ నుంచి కొల్లాపూర్‌కు వెళ్తున్న బస్సులో ప్రయాణిస్తున్న ఓ యువతి స్థానిక కొత్త బస్టాండ్‌లో అదృశ్యమైనట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం అంకిరావుపల్లికి చెందిన అనూష పెద్దమ్మ లక్ష్మితో కలిసి శుక్రవారం హైదరాబాద్ నుంచి కొల్లాపూర్‌కు బస్సులో బయలుదేరింది. జడ్చర్ల కొత్తబస్టాండ్‌లో బస్సు ఆగి ఉన్న సమయంలో లక్ష్మి మూత్రశాలకు వెళ్లి వచ్చే సరికి అనూష కనిపించలేదు. బస్టాండ్, పరిసర ప్రాంతాల్లో వెదికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. వచ్చే నెలలోనే పెళ్లి ఉందని.. గ్రామానికి చెందిన ఓ యువకుడిపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొనడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

మారుమునగాల–2లో మహిళ..

ఉండవెల్లి: మండలంలోని మారమునగాల–2 గ్రామానికి చెందిన పింజరి రజియ (43) గురువారం రాత్రి నుంచి కనబడటం లేదని భర్త పింజరి మైబాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు. పింజరి రజియాను బోరవెల్లి నుంచి స్వగ్రామమైన మారమునగాల–2కు బావమరిది నసీరుద్దీన్ ఇంటికి తీసుకొచ్చారు. రాత్రి నుంచి కనబడకపోవడంతో ఎక్కడ వెదికినా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం భర్త మైబాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భర్త కనిపించడం లేదని..

అడ్డాకుల: మండలంలోని కాటవరం గ్రామానికి చెందిన శేషయ్య కనిపించడం లేదని శుక్రవారం భార్య రాములమ్మ ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి శేషయ్య గొర్రెల కాపరిగా పనిచేసేవాడు. ఈ నెల 23న తెల్లవారుజామున ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెదికినా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం భార్య రాములమ్మ ఠాణాలో ఫిర్యాదు చేసింది.

ముగ్గురికి శిక్ష జైలు

గద్వాల క్రైం: అదనపు కట్నం కోసం రెండో భార్యను వేధింపులకు గురిచేసి కిరోసిన్ పోసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో మొదటి భార్య, భర్త, మరిదికి అయిదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ గురువారం గద్వాల అదనపు సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ప్రభాకర్ తీర్పు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. జోగుళాంబ గద్వాల జిల్లా శాంతినగర్‌కు చెందిన ఎండీ బషీర్ అహ్మద్ దేవరకద్రకు చెందిన ఫరీదాబేగంను మొదటి వివాహం చేసుకున్నాడు. ఆమెకు సంతానం కలగకపోవడంతో కుటుంబ పెద్దలు గద్వాలకు చెందిన సాజిదాతో 2006లో రెండో వివాహం జరిపించారు. వివాహమైన రెండునెలల తర్వాత ఉపాధి నిమిత్తం భర్త సౌదీకి వెళ్లాడు. వివిధ సందర్భాల్లో వచ్చిన భర్త, మొదటి భార్య, మరిది గౌస్‌బాషా అదనపు కట్నం కోసం సాజీదాను మానసికంగా, శారీరకంగా వేధిస్తుండటంతో ఆమె కుటుంబ సభ్యులు రూ.4 లక్షల వరకు ఇచ్చారు. కొన్ని రోజులు బాగానే ఉన్నా.. 9.11.2019లో అదనపు కట్నం తీసుకురావాలంటూ తీవ్రంగా గాయపర్చడమేగాక కిరోసిన్ పోసి నిప్పంటించే ప్రయత్నం చేశారు. ఆమె బయటకు పరుగులు తీసి స్థానికుల సాయంతో శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి ముగ్గురు నిందితులకు అయిదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెల్లడించారు. దీంతో ముగ్గురిని రిమాండ్ తరలించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది, పీపీ వెంకట్రాములు, కోర్టు సిబ్బందిని ఎస్పీ సృజన అభినందించారు.

చకచకా నిర్మాణం



దుందుబీ వాగుపై బ్రిడ్జి కం చెక్‌డ్యాం నిర్మాణం

దుందుబీ వాగుపై కొనసాగుతున్న బ్రిడ్జి కం చెక్‌డ్యాం పనులు

- ఉడిత్యాల–సూరారం మధ్య తగ్గనున్న దూరభారం
- పెరగనున్న భూగర్భ జలాలు
- ఊపందుకున్న రియల్ వ్యాపారం

బాలానగర్: మండలంలోని ఉడిత్యాల–సూరారం గ్రామాల మధ్యలో ఉన్న దుందుభి వాగుపై సుమారు రూ.3 కోట్ల వ్యయంతో 83 మీటర్ల పొడవు 7.5 మీటర్ల వెడల్పుతో వంతెన, చెక్‌డ్యామ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మొత్తం 7 స్లాబ్‌లకుగాను 3 పూర్తికాగా మిగిలిన 4 జూన్ చివరికల్లా పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. వర్షాకాలంలోగా పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ ప్రాంతవాసుల చిరకాల కోరిక వంతెన నిర్మాణంతో ఇటు రవాణా కష్టాలు తీరడమేగాక అటు భూగర్భ జలాలు పెరిగి సాగు, తాగునీటి సమస్యలు తీరనున్నాయి.

- నది పారుతున్న సమయంలో దాటేందుకు వెళ్లి పలువురు కొట్టుకుపోయిన సందర్భాలు ఉన్నాయి. నది ప్రవాహం అధికంగా సమయంలో రోజుల తరబడి అధికారులు కంచె వేసి రాకపోకలు నిలిపివేసిన పరిస్థితులు అనేకమార్లు వచ్చాయి. ఉడిత్యాల, సూరారం గ్రామస్తులు ఒక ఊరి నుంచి మరో ఊరికి వెళ్లాలంటే 2.5 కిలోమీటర్లు ఉన్న దూరం 20 కిలోమీటర్ల పైచిలుకు ప్రయాణించాల్సిన పరిస్థితి. అదేవిధంగా ఉడిత్యాల గ్రామస్తులు షాద్‌నగర్ వెళ్లాలన్నా బాలానగర్ మీదుగా 17 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సిన దుస్థితి ఉండేది. నది ఉధృతి కారణంగా పలుమార్లు పాఠశాలలకు సెలవులు ప్రకటించిన రోజులూ ఉన్నాయి.

త్వరగా పూర్తిచేయాలి..



వంతెన నిర్మాణం త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. పనులు చురుగ్గా సాగుతున్నందుకు సంతోషంగా ఉంది. – లింగం, ఉప సర్పంచ్, సూరారం

ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం..



ఉడిత్యాల, సూరారం గ్రామస్తుల చిరకాల కోరిక వంతెన నిర్మాణంతో పాటు చెక్‌డ్యాం ఏర్పాటు చేయడం హర్షణీయం. పనులు చురుగ్గా సాగుతూ స్లాబ్ వరకు వచ్చింది. ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి రుణపడి ఉంటాం. – ప్రదీప్‌గౌడ్, ఎంపీటీసీ, ఉడిత్యాల

రెండు నెలల్లో అందుబాటులోకి..

దుందుభి నదిపై బ్రిడ్జి కం చెక్‌డ్యాం పనులు వేగంగా సాగుతున్నాయి. రెండు నెలల్లో పనులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాం. జులైలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. – వెంకటేశ్వర్‌రెడ్డి, ఏడీఈ

భూముల ధరలకు రెక్కలు..

గతంలో ఎకరం భూమి రూ.20 లక్షల వరకు ఉండగా.. ప్రస్తుతం రూ.60 లక్షల నుంచి రూ.కోటి పైచిలుకు పలుకుతుంది. ఇప్పటికే రియాల్టర్లు ముందస్తు ప్రణాళికతో తక్కువ ధరలకు భూములు కొని వెంచర్లు చేస్తున్నారు. అదేవిధంగా వ్యవసాయ భూములకు సైతం డిమాండ్ బాగానే పెరిగిందని గ్రామస్తులు చెబుతున్నారు.

'పాలమూరు ప్రాజెక్టు'తో సస్యశ్యామలం చేస్తాం



జడ్చర్లలో మాట్లాడుతున్న సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క

- రైతుల నోట్లో సీఎం కేసీఆర్ మట్టి కొట్టారు
- ధరణిని ప్రక్షాళన చేసి.. కాస్తు, పహణి కాలమ్స్ పెడతాం
- బీఆర్ఎస్ నాయకులు లాక్కున్న భూములు తిరిగి పేదలకు పంచుతాం
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క
- నాగర్‌కర్నూల్ జిల్లాలోకి ప్రవేశించిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర

జడ్చర్ల/ బిజినేపల్లి: కరువు, వలసల జిల్లాగా ఖ్యాతిగాంచిన పాలమూరును కోనసీమగా మారుస్తామని, బీడు భూములకు పాలమూరు ప్రాజెక్టు ద్వారా సాగునీరందించి సస్యశ్యామలం చేస్తామని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం జడ్చర్ల మండలంలోని కిష్టంపల్లి క్రాస్ రోడ్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రెండేళ్లలో పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి కృష్ణా జలాలతో రైతుల పొలాలను తడుపుతామని చెప్పారు. టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు ప్రాజెక్టుల డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌ను పూర్తి చేసి నాలుగున్నర లక్షల ఎకరాలకు తాము అధికారం చేపట్టిన ఏడాదిలోగా సాగు నీరందిస్తామన్నారు. కుర్చీ వేసుకుని పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తామని ప్రగల్భాలు పలికిన సీఎం కేసీఆర్ దశాబ్దకాలం అవుతున్నా ఇచ్చిన మాటను నిలుపుకోలేదని విమర్శించారు. ఫలితంగా భూములన్నీ బీళ్లుగా మారాయని, వలసలు ఆగడం లేదన్నారు. సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతుల నోట్లో కేసీఆర్ మట్టి కొట్టాడని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాలనలో పేదలకు పంపిణీ చేసిన భూములను బలవంతంగా టీఆర్ఎస్ ప్రభుత్వం లాక్కుందని, ఆయా భూములను తాము అధికారంలోకి రాగానే తిరిగి పేదలకు పంపిణీ చేస్తామన్నారు. అలాగే ధరణిలో కాస్తు కాలంలో ఉన్న రైతులు భూమిపై హక్కు కోల్పోయారని, వీరికి తిరిగి హక్కు కల్పించేలా మార్పులు చేస్తామన్నారు. ధరణిని ప్రక్షాళణ చేసి కాస్తు కాలంతోపాటు పహణీలో ఉన్న కాలమ్స్ తీసుకువచ్చి దున్నేవాడికి భూమిపై హక్కు కల్పిస్తామన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని స్పష్టం చేశారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా గురువారం రాత్రి నిర్వహించిన బహిరంగ సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేసిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పాదయాత్ర తిమ్మాజిపేట మండలంలోని మరికల్ వద్ద నాగర్‌కర్నూల్ జిల్లాకు చేరుకుంది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్, డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

భట్టికి జననీరాజనం..

పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ద్వారా శుక్రవారం సాయంత్రం తిమ్మాజిపేట మండలంలోని మరికల్ వద్ద నాగర్‌కర్నూల్ జిల్లాలోని అడుగు పెట్టిన భట్టి విక్రమార్కకు జనం నీరాజనం పట్టారు. మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందించి.. శాలువాతో సన్మానించగా.. గిరిజనుల నృత్యాలు, ఆటాపాటలతో ఘనంగా స్వాగతం పలికారు. పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి పాదయాత్రను కొనసాగించారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. తిమ్మాజిపేట మండల కేంద్రం సమీపానికి చేరుకున్న తర్వాత మధ్యాహ్నం భోజనం విశ్రమించారు. పాదయాత్రగా వెళ్తున్న భట్టి విక్రమార్కను ఆటోలు, బస్సుల్లో వెళ్లే ప్రయాణికులు, కూలీలు వచ్చి కలిశారు. తమకు ఇళ్లు, పింఛన్లు లేవని, పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని, ధరణిలో భూములు పోయాయని గోడు వెళ్లబోసుకున్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, ప్రతిఒక్కరి సమస్యలు తీరుస్తామని భట్టి హామీ ఇచ్చారు.



రైతుతో కలిసి పాదయాత్ర



మేమూ సైతం అంటూ కాంగ్రెస్ జెండాలతో చిన్నారులు

రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు..

తిమ్మాజిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో భట్టి మాట్లాడుతూ అమ్మహస్తం పేరుతో వచ్చే 9 రకాల సరుకులకు బదులు రూపాయికి కిలో బియ్యం ఇచ్చి మిగిలిన సరుకులు మాయం చేసిన ఘనత కేసీఆర్‌దేనని విమర్శించారు. నాలుగు కోట్ల ప్రజలు బాగుపడటానికి సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే.. కేసీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు దోపిడీ చేస్తున్నారన్నారు. రాష్ట్ర ఏర్పాటు సమయంలో తెలంగాణ నినాదం వినిపించిన విశ్వవిద్యాలయాల విద్యార్థులకు నేడు కొలువులు లేకుండా పిచ్చోళ్లుగా మార్చారన్నారు. అదిలాబాద్ నుంచి నాగర్‌కర్నూల్ వరకు చేసిన పాదయాత్రలో తాను చెప్పిన మాటలపై ప్రభుత్వంతో చర్చకు సిద్ధమన్నారు. అనంతరం గుమ్మకొండ మీదుగా సాగిన పాదయాత్ర బిజినేపల్లి శివారులోని రాంరెడ్డిపల్లితండా వద్ద రాత్రి బస చేపట్టారు. శనివారం ఉదయం భట్టి విక్రమార్క వట్టెం ప్రాజెక్టు వద్ద కేఎస్ఆర్ క్యాంప్, వట్టెం ప్రాజెక్టు డ్యాం, కారుకొండ, కుమ్మెర గ్రామాల మీదుగా పాదయాత్ర కొనసాగనుంది.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కృష్ణా: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను శుక్రవారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పరామర్శించారు. తమ సహాయ సహకారాలతో పాటు అన్నిరకాలుగా ప్రభుత్వ సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. గురువారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ఘటనలో గుర్జాల్ గ్రామానికి చెందిన అంజప్ప, ఆయన భార్య నర్సమ్మ, కుమారుడు అనిరుద్ ఒకే కుటుంబానికి చెందినవారు మృతి చెందారు. ఈ ప్రమాదానికి గల కారణాలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో సమాచారం సేకరించాలని పోలీసులకు సూచించారు. ఆయనతోపాటు బీఆర్ఎస్ మండల నాయకులు మోనేష్, మహాదేవ్, ఖాదర్ తదితరులు ఉన్నారు.

మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం ఆటోతో ఎక్సైజ్ పోలీసులు

అలంపూర్: అంతర్రాష్ట్ర రహదారిపై అక్రమంగా తరలిస్తున్న మద్యంను పట్టుకున్నామని ఎక్సైజ్ సీఐ గోపాల్ తెలిపారు. ఎక్సైజ్ ఎస్‌ఐ గోవర్ధన్, ఆయన బృందం అయిజలోని ఫంక్షన్ హాల్స్, ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీలో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఇద్దరు అనుమానితలను గుర్తించి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. అలాగే అయిజ–రాయచూరు రోడ్డులో ఉన్న బల్గెర వ్యవసాయ చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేయగా ఆటోలో 180 ఎంఎల్ టెట్రాప్యాకెట్ల మూడు కాటన్లు, 750 ఎం.ఎల్ ఒక కాటన్ పట్టుబడ్డాయని తెలిపారు. అక్రమంగా మద్యం తరలిస్తున్న బేతంచర్లకు చెందిన హనుమంతు, తిరుమలేష్‌పై కేసు నమోదు చేశామని, ఆటోను సీజ్ చేశామని సీఐ తెలిపారు.

వేరుశనగ క్వింటా రూ.6,680

జడ్చర్ల/ దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం వేరుశనగ క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.6,680, కనిష్ఠంగా రూ.6,190 ధరలు లభించాయి. అలాగే మొక్కజొన్నకు గరిష్ఠంగా రూ.1,836, కనిష్ఠంగా రూ.1,244, ఆముదాలు గరిష్ఠంగా రూ.5,426, కనిష్ఠంగా రూ.5,335, హంస గరిష్ఠంగా రూ.1,659, కనిష్ఠంగా రూ.1,212, ఆర్‌ఎన్ఆర్ గరిష్ఠంగా రూ.2,209, కనిష్ఠంగా రూ.1,229, పెబ్బర్లు సరాసరిగా రూ.4,417 చొప్పున పలికాయి.

సోనామసూరి ధర రూ. 2039

దేవరకద్ర మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన ఈనామ్ టెండర్లలో సోనామసూరి ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.2,039, కనిష్ఠంగా రూ.1,719 ధరలు లభించాయి. హంసకు సరాసరిగా రూ.1,511, ఆముదాలు సరాసరిగా రూ.5,309 పలికింది. మార్కెట్‌లో సీజన్ తగ్గడంతో కేవలం 500 బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

మైనర్ ప్రేమ వివాహం

ఊట్కూరు: పెద్దపొర్లకు చెందిన 16 ఏళ్ల బాలికకు ప్రేమ వివాహం జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాలికా సంరక్షణ కేంద్ర అధికారులు తెలిపిన వివరాలిలా.. గ్రామానికి చెందిన బాలికకు అదే గ్రామానికి చెందిన యువకుడితో నాలుగు రోజుల క్రితం ఓ ఆలయం దగ్గర ప్రేమ వివాహం జరిగింది. రెండురోజుల క్రితం వారు గ్రామానికి రావడంతో గురువారం గ్రామస్తులు కొందరు హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో బాలిక తల్లిదండ్రులతో మాట్లాడి బాలికను, యువకుడిని సఖి కేంద్రానికి తరలించామని అధికారులు తెలిపారు. బాల్య వివాహం చేసుకోవడం చట్టరీత్యా నేరం అని, అలాంటి చర్యలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు శ్రావణ్, సంధ్య తెలిపారు.

ఆయిల్‌పాం తోట దగ్ధం



ఆయిల్‌పాం తోటలో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



కాలిపోతున్న ట్రాక్టర్, పశుగ్రాసం

తెలకపల్లి: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని పామ్‌ఆయిల్‌తోట దగ్ధం అయ్యింది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాలు.. శుక్రవారం మండల పరిధిలోని పెద్దూరు గ్రామానికి చెందిన తిరుపతయ్యగౌడ్ ఆయిల్‌పాం తోటకు నిప్పంటుకొని దగ్ధమైంది. తనకున్న నాలుగు ఎకరాలలో దాదాపు 200 మొక్కలు సాగు చేశాడు. శుక్రవారం మధ్యాహ్నం పక్కనే ఆయన మొక్కజొన్న చొప్పలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. వేసవికాలం కావడంతో మొక్కజొన్న చొప్పకు నిప్పంటుకొని ఆయిల్‌పాం తోటకు పాకింది. 90 శాతం ఆయిల్‌పాం తోట కాలిపోయిందని గ్రామస్తులు తెలిపారు. ఆయిల్‌పాం చెట్లతో పాటు డ్రిప్ పైపులైన్ కూడా కాలిపోయింది. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో మంటలను ఆర్పివేశారు. అప్పటికే పూర్తిగా దగ్ధం అయినట్లు తెలిపారు. 2లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగినట్లు గ్రామస్తులు, బాధితులు తెలిపారు.

పశుగ్రాసం, ట్రాక్టర్ దగ్ధం

మల్దకల్: ట్రాక్టర్‌లో పశుగ్రాసం తరలిస్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో మంటలు చెలరేగి దగ్ధమైన ఘటన మండలంలోని ఉలిగేపల్లి సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రైతు పరశురాములు అదే గ్రామానికి చెందిన వెంకటన్న ట్రాక్టర్‌ను వరిగడ్డి తరలించేందుకు తీసుకెళ్లారు. పొలంలో నుంచి గడ్డిని తీసుకొస్తున్న క్రమంలో విద్యుత్ తీగలు తగిలి మంటలు వ్యాపించాయి. గుర్తించిన రైతులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి వచ్చేలోపే ట్రాక్టర్, పశుగ్రాసం కాలి బూడిదయ్యాయి. రూ.8 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు.


రికార్డుల్లో పేరు తొలగింపుపై ఫిర్యాదు

కొల్లాపూర్: కొల్లాపూర్‌లోని సెయింట్ మేరీస్ హైస్కూల్ అడ్మిషన్ రికార్డుల్లో పేరు తొలగించి, ఇంకొకరి పేరు నమోదు చేయడంపై బాధిత విద్యార్థి తండ్రి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. కోడేరు మండలం మైలారం గ్రామ పంచాయతీ పరిధిలోని నార్యాతండాకు చెందిన ఎం.జగన్‌నాయక్ 2007 నుంచి 2012 వరకు సెయింట్ మేరీస్ స్కూల్‌లో 1 నుంచి 5వ తరగతి వరకు చదివాడు. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలోని మమత వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. జగన్‌నాయక్ తండ్రి ప్రకాష్ ఇటీవలనే కుమారుడి బోనఫైడ్ సర్టిఫికెట్ కోసం సెయింట్ మేరీస్ స్కూల్‌కు వెళ్లారు. మీ అబ్బాయికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని సూచించారు. దీంతో ఆయన గతంలో పాఠశాల నుంచి పొందిన టీసీ, బోనఫైడ్ జిరాక్స్ ప్రతులను పాఠశాల ప్రిన్సిపల్‌కు చూపారు. వాటిని పరిశీలించగా జగన్‌నాయక్ అడ్మిషన్ నంబర్ స్థానంలో అతని పేరును వైట్నర్‌తో తొలగించి భూపని శివప్రసాద్ అనే విద్యార్థి పేరు రాశారు. ఈ అంశంపై ప్రకాష్ శుక్రవారం కొల్లాపూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై పాఠశాల నిర్వాహకులు శ్రీకుమార్, జగన్ మాట్లాడుతూ తాము పాఠశాల నిర్వహణను 5 సంవత్సరాల క్రితం నుంచే పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. గతంలో పాఠశాల నిర్వహణ చూసిన వారి హయాంలో ఏం జరిగిందో తమకు తెలియదన్నారు. ఒకవేళ రికార్డుల్లో తప్పుగా పేరు నమోదై ఉంటే విద్యాశాఖ అధికారుల అనుమతి తీసుకొని దాన్ని సరిచేస్తామని చెప్పారు. ఈ విషయమై ఎస్‌ఐ బాలవెంకటరమణను వివరణ కోరగా ఈ అంశం విద్యాశాఖ పరిధిలోకి వస్తుందని, దీనిపై విచారణ చేపడతామని పేర్కొన్నారు.

ఆటో, బైక్ ఢీ : వ్యక్తి దుర్మరణం

అమరచింత: ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో బైక్ నడుపుతున్న ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వరనాయుడు తెలిపారు. ఆయన కథనం మేరకు.. నారాయణపేట జిల్లా మరికల్ మండలం కన్మనూర్‌కు చెందిన రాయచూర్ శివరాజు (60) మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంటలో జరిగే ఓ శుభకార్యానికి శుక్రవారం బైక్‌పై గ్రామం నుంచి వెళ్లాడు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మండలంలోని చంద్రప్పతండా సమీపంలో అమరచింత నుంచి చిన్నచింతకుంటకు కూరగాయల లోడ్‌తో వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివరాజుకు తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. శివరాజుకు భార్య చెన్న బసమ్మ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు : భార్యాభర్తలకు గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన ద్విచక్రవాహనం

కొత్తకోట: జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వెనక నుంచి ఓ కారు ఢీకొట్టడంతో భార్యాభర్తలకు తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం మండలంలోని అమడబాకుల స్టేజీ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలిలా.. మహబూబ్‌నగర్‌కు చెందిన భార్యాభర్తలు జమీనా, ఖాదర్ సొంత పనిమీద ద్విచక్రవాహనంపై మహబూబ్‌నగర్ నుంచి పెబ్బేరుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో అమడబాకుల స్టేజీ వద్ద జాతీయ రహదారిపై వెనక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు ఇద్దరికీ తీవ్రగాయాలు కావడంతో స్థానికులు క్షతగాత్రులను 108లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రెండు బైక్‌లు ఢీకొని..

మక్తల్: రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన మక్తల్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా.. స్థానిక బీసీకాలనీకి చెందిన సుగుణ కూరగాయలు కొనుగోలు చేసుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా.. వనాయికుంటకు చెందిన వెంకటప్ప ద్విచక్రవాహనంపై వెళ్తూ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి.. అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లాకేంద్రానికి తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

త్రినేత్ర గోల్డ్: మీ బంగారం బ్యాంకులో గాని ఏ సంస్థలో వున్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును.(స్క్రాప్) బంగారంపై అధిక లోన్ ఇవ్వబడును. ✆ 9389214214.

యువత మేలుకో

గత 10 సంవత్సరాల నుండి మన బతుకులు నాశనం చేసిన వారిని ఓడిద్దాం. మహిళలకు 50% సీట్లు. మనం కలిస్తే తక్కువ డబ్బుతో రాజకీయం "మా తెలంగాణ పార్టీ" వివరిస్తుంది. సెల్ Whatsapp: 8790476388.

WANTED

Urgent Sale: 175Sq.Yd. North East Corner Plot in Jadcherla, KVMPT Call: 9948124949

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ. 16K-18K, ఏజెంట్ కమిషన్ 6K. ఫోన్.9640258899.

రేమండ్ షోరూం, జడ్చర్ల, నాగర్‌కర్నూల్ వనపర్తి లో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్, స్టోర్ ఇంఛార్జ్, సేల్స్ ఇంఛార్జ్ కావలెను. సెల్: 9492801999, 08543796688.

మహబూబ్ నగర్ RTC రీజనల్ ఆఫీస్‌లో ఉద్యోగం చేయుటకు సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 8గం. డ్యూటీ మంచి జీతం కలదు. ఫోన్: 9248355129

కృష్ణలత హాస్పిటల్, రాజేంద్రనగర్ మహబూబ్‌నగర్ నందు పనిచేయుటకు అనుభవజ్ఞులైన ఫార్మసిస్ట్ కావలెను. సంప్ర: 9573890246, 7013354295.

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు నాలుగు లైన్లకు రూ.: 200/- (Black & White) అదనపు లైనుకు రూ. : 50 5% GST అదనం మాత్రమే

మహబూబ్‌నగర్ : 9010234478, 9010522215, 9705135557, 9010869797
జడ్చర్ల : 9010076222
నాగర్‌కర్నూల్ : 9010006785
వనపర్తి : 9010068317
గద్వాల : 9553955603
నారాయణపేట : 9010962007

సాక్షి భవిత విద్యార్థుల కోసం

గమనిక

క్లుప్తంగా...

తెయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ కనకయ్య


ప్రొఫెసర్ కనకయ్య

తెయూ(డిచ్‌పల్లి): ఈసీ (పాలకమండలి) నిర్ణయాన్ని బేఖాతరు చేస్తూ తెలంగాణ యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ కనకయ్యను వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్‌గుప్తా నియమించారు. ఈ మేరకు శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే కనకయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ.. వీసీ రవీందర్‌గుప్తా, పాలక మండలి సభ్యులు, రెగ్యులర్ అధ్యాపకులు, కాంట్రాక్టు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల సహకారంతో యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ప్రొఫెసర్ యాదగిరి తర్వాత తానే సీనియర్‌నని చెప్పారు. బయట యూనివర్సిటీలకు చెందిన వారిని రిజిస్ట్రార్‌గా తెస్తే ఒప్పుకునేది లేదన్నారు. ఇదే విషయాన్ని తాను రెండు నెలలుగా ఈసీ మెంబర్లకు చెప్పడంతో పాటు వారిని వ్యక్తిగతంగా కలిసి విన్నవించానని, కొందరు ఈసీ మెంబర్లు సైతం తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పారని వివరించారు. వచ్చే నెల 3న జరిగే ఈసీ సమావేశంలో తనను రిజిస్ట్రార్‌గా ఆమోదిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన కనకయ్యను పలువురు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

అన్యమత ప్రచారం చేయొద్దు

గోపన్‌పల్లిలో బోర్డు ఏర్పాటు


అన్యమత ప్రచారం చేయొద్దంటూ గోపన్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన బోర్డు

బిచ్కుంద: తమ గ్రామంలో అన్యమత ప్రచారాన్ని నిషేధించినట్టు కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం గోపన్‌పల్లిలో బోర్డు ఏర్పాటు చేశారు. 'ప్రచారం చేయవద్దు.. దయచేసి సహకరించండి.. అతిక్రమించి గ్రామంలో మత ప్రచారం చేస్తే తన్ని పోలీసులకు అప్పగిస్తామని'.. బోర్డులో పేర్కొన్నారు. కాగా 20 రోజుల క్రితం పుల్కల్ గ్రామంలో అన్యమత ప్రచారం చేస్తున్నారని కొందరు యువకులు ఓ ఇంటిపైకి వెళ్లి దాడి చేశారు. దీంతో వారిపై అట్రాసిటీ కేసు నమోదైంది. పుల్కల్‌లో జరిగిన ఘటన పునరావృతం కాకూడదనే ఉద్దేశంతో గోపన్‌పల్లిలో బోర్డు ఏర్పాటు చేసినట్టు గ్రామస్తులు కొందరు తెలిపారు.

ప్రతి నెలా పీఏసీ

- కాంగ్రెస్ ముఖ్య నేతల నిర్ణయం
- పీఏసీలో చర్చించిన తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలి
- 20 రోజుల పాటు 'దశాబ్ది దగా' పేరిట కార్యక్రమాలు
- బీసీ గర్జనకు సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లకు ఆహ్వానం


కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన ముఖ్యనేతలు

సాక్షి, హైదరాబాద్: ఇక నుంచి ప్రతి నెలా మొదటి వారంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ ముఖ్య నేతలు నిర్ణయించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సంబంధిత అంశాలు పీఏసీలో చర్చించాలని, ఆ తర్వాతే నిర్ణయాలు అమలు చేయాలని తీర్మానించారు. శుక్రవారం గాంధీభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతల సమావేశం జరిగింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నేతలు జానారెడ్డి, వి.హనుమంతరావు, పొన్నాల లక్ష్మయ్య, మధుయాష్కీ గౌడ్, శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు నదీమ్‌జావెద్, సంపత్‌కుమార్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు మహేశ్‌కుమార్‌గౌడ్, అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీ ఉన్నట్టా లేనట్టా?

రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా మాణిక్‌రావ్ ఠాక్రే బాధ్యతలు చేపట్టిన తర్వాత పీఏసీ సమావేశాలు నిర్వహించకపోవడంపై చర్చ జరిగింది. తొలినాళ్లలో ఒకసారి మాత్రమే నిర్వహించారని, ఆ తర్వాత ఎలాంటి సమావేశం జరపకుండానే ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని పలువురు వ్యాఖ్యానించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ప్రతి నెలా మొదటి వారంలో పీఏసీ సమావేశం నిర్వహించాలని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవాల సందర్భంగా పార్టీ తరఫున నిర్వహించాల్సిన కార్యక్రమాలపై కూడా సమావేశంలో చర్చించారు. 'వచ్చే నెల రెండో తేదీన జాతీయ జెండా ఆవిష్కరణతో పాటు తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీకి కృతజ్ఞతలు తెలుపుతూ ఆమె చిత్రపటాలకు పాలాభిషేకం చేయాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం రోజుకో కార్యక్రమం చొప్పున 20 రోజుల పాటు 'దశాబ్ది దగా' పేరుతో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలి. గత తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణలోని అన్ని వర్గాలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. అదే విధంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏం చేస్తుందో చెప్పాలి..' అని నిర్ణయించారు. ఈ కార్యక్రమాలు జరుగుతున్నన్ని రోజులు పార్టీ శ్రేణులు తమ ఇళ్లపై కాంగ్రెస్ జెండాలు ఎగురవేయాలని సమావేశం పిలుపునిచ్చింది.

ఇప్పుడు వారికే దోచిపెడుతున్నారు: మధుయాష్కీ

గతంలో ఆంధ్ర వాళ్లు దోచుకుంటున్నారని చెప్పిన కేసీఆర్ ఇప్పుడు వారికే దోచిపెడుతున్నారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ ఆరోపించారు. ముఖ్య నేతల భేటీ అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, వీహెచ్, సంపత్‌కుమార్, నదీమ్ జావెద్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. త్వరలోనే పార్టీ ఆధ్వర్యంలో బీసీ గర్జన ఏర్పాటు చేస్తామని, ఈ సభకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లను ఆహ్వానిస్తామని చెప్పారు. పార్లమెంటు నూతన భవన నిర్మాణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీలంతా బహిష్కరించనున్నట్టు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. హిమాచల్ సీఎం సుఖుపై బీఆర్‌ఎస్ నేతల విమర్శలను వారి విచక్షణకే వదిలివేస్తున్నామని శ్రీధర్‌బాబు అన్నారు.

త్వరలో సికింద్రాబాద్–నాగ్‌పూర్ మధ్య.. వందేభారత్

- ప్రస్తుతం ఇరు నగరాల మధ్య 11 గంటల ప్రయాణ సమయం
- వందేభారత్‌తో ఇక ఆరున్నర గంటలే
- మరింత పెరగనున్న వాణిజ్య సంబంధాలు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌కు త్వరలో మరో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రాబోతోంది. హైదరాబాద్–నాగ్‌పూర్ మధ్య ఈ రైలు ప్రారంభం కానుంది. ఈ సంవత్సరారంభంలో దక్షిణమధ్య రైల్వేకు మూడు వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను రైల్వే బోర్డు మంజూరు చేసింది. అందులో తొలి రైలు సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య సంక్రాంతి రోజున ప్రారంభమవగా ఏప్రిల్‌లో సికింద్రాబాద్–తిరుపతి మధ్య రెండో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభమైంది. మూడో వందేభారత్ రైలు హైదరాబాద్–పుణే మధ్య ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ ఇప్పుడు దానికంటే ముందు నాగ్‌పూర్‌తో అనుసంధానం తెరపైకి వచ్చింది. దీనికి రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ కూడా సానుకూలత వ్యక్తం చేశారు. ఈ రెండు నగరాల మధ్య ఉన్న వాణిజ్య సంబంధాలను దృష్టిలో పెట్టుకొని వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నడపాలని నిర్ణయించామని ఆయన పేర్కొన్నట్లు తెలిసింది.

తగ్గనున్న ప్రయాణ సమయం..


నాగ్‌పూర్–హైదరాబాద్ మధ్య ఇప్పటివరకు శతాబ్ది, రాజధాని లాంటి ప్రీమియర్ కేటగిరీ రైళ్లు లేవు. సాధారణ రైళ్లు ఆ ప్రాంతం మీదుగా రాకపోకలు సాగిస్తున్నా ఇరు నగరాల మధ్య 581 కి.మీ. దూరం ఉండటంతో ప్రయాణ సమయం 11 గంటలుగా ఉంటోంది. దీంతో ప్రయాణ సమయాన్ని తగ్గిస్తే వ్యాపార బంధం మరింత దృఢంగా మారుతుందన్న ఉద్దేశంతో మహారాష్ట్రలోని చంద్రాపూర్ ప్రాంతానికి చెందిన ఆ రాష్ట్ర అటవీ శాఖ మంత్రి సుదీర్ ముంగంటివార్ ఇటీవల రైల్వే మంత్రిని కలిసి వందేభారత్ రైలును కోరారు. విదర్భలోని వార్ధా ఎంపీ రామ్‌దాస్ కూడా ఈ మేరకు విన్నవించారు. వాటికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించడంతో అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

తాత్కాలిక టైంటేబుల్ ఇలా...

ప్రతిపాదిత వందేభారత్ ఎక్స్‌ప్రెస్ తాత్కాలిక టైంటేబుల్‌ను అధికారులు రూపొందించారు. దీని ప్రకారం రైలు నాగ్‌పూర్‌లో ఉదయం 6 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12:30కు సికింద్రాబాద్ చేరుకోనుంది. మళ్లీ మధ్యాహ్నం 1:30కు సికింద్రాబాద్‌లో బయలుదేరి రాత్రి 8 గంటలకు నాగ్‌పూర్ చేరుకుంటుంది. వారంలో ఆరు రోజులు ఈ రైలు తిరగనుంది. బల్లార్షా, సిర్పూర్, కాగజ్‌నగర్, రామగుండం, కాజీపేటల్లో ఈ రైలుకు తాత్కాలిక స్టాప్‌లను కేటాయించారు. ఎకానమీలో రూ.1,450– రూ.1,550, ఎగ్జిక్యూటివ్‌లో రూ.2,750–రూ.2,850 వరకు చార్జీలను ఖరారు చేసే వీలుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

వలసల జిల్లాగా మార్చిందే కాంగ్రెస్

- పాలమూరును అభివృద్ధి చేసి ఉంటే తెలంగాణ ఏర్పాటు అవసరమేలేదు
- కాంగ్రెస్ పార్టీపై మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ధ్వజం



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పాలమూరు జిల్లాను వలసలకు చిరునామాగా మార్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ధ్వజమెత్తారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీయేనని.. అప్పుడు పాలమూరు జిల్లాను అభివృద్ధి చేసి ఉంటే తెలంగాణ రాష్ట్ర డిమాండ్ ఉండేదే కాదని అభిప్రాయపడ్డారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...జడ్చర్ల కాంగ్రెస్ సభలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్‌పై చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. పాలమూరు జిల్లాలో 14 రోజులకోసారి మంచినీళ్ల వచ్చే పరిస్థితి కాంగ్రెస్ వల్లే దాపురించిందన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాకే పాలమూరులో నిత్యం తాగునీరు వస్తోందని, వ్యవసాయానికి ఉచితంగా 24 గంటలపాటు కరెంట్, రైతులకు పంట పెట్టుబడి అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వివరించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రైతుబంధు పథకం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో కేవలం రెండు టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌ను కూడా కాంగ్రెస్ పాలనలో పూర్తి చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. సాగు, తాగునీటిని అందించి వలసలు వాపస్ వచ్చేలా చేశామని, పెద్దఎత్తున పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు స్థానికంగా ఉపాధి అందిస్తున్నామని, అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు.

పార్ట్–బీతో భూములు ఫట్

గ్రామకంఠం భూముల్లో బీఆర్‌ఎస్ కబ్జాలు: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



బిజినేపల్లి: దేశ విభజన సమయంలో హైదరాబాద్ నుంచి పాకిస్తాన్ వెళ్లిన వారి భూముల సమాచారం సమగ్ర భూ సర్వేతో సేకరించి వాటిని పార్ట్–బీలో చేర్చి విలువైన భూములను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రభుత్వం దోచుకుందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు. నిజాం పాలకులు సామాజిక అవసరాల కోసం ప్రతి గ్రామంలో కేటాయించిన 30% గ్రామకంఠం భూములను కూడా పార్ట్–బీలో చేర్చి గ్రామాల్లోని బీఆర్‌ఎస్ పెద్దలు తమకు కావాల్సిన వారి పేరిట ఎక్కించి అమ్ముకుంటున్నారన్నారు. భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శుక్రవారం సాయంత్రం తిమ్మాజిపేట మండలంలోని మరికల్ గ్రామం వద్ద నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రవేశించింది. ఈ సందర్భంగా తిమ్మాజిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర రాజధాని ప్రజల దాహార్తి కోసం తీసుకున్న కృష్ణా నీళ్ల ఈ ప్రాంతంలో ఉన్న బీడు భూములకు అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ఇంటింటికి శుద్ధజలం పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ ప్రాజెక్టును నిర్వీర్యం చేసి.. ప్రజలకు నీళ్ల అందించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసి బిడ్డలకు మంచినీళ్ల అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఐటీడీఏ ప్రాజెక్టుల ద్వారా తవ్విన బావులే ఇప్పటికీ వారి దాహం తీరుస్తున్నాయని పేర్కొన్నారు. కొలువుల కోసం కొట్లాడితే కేసులు పెట్టి ఉద్యోగాలు రాకుండా చేస్తుందన్న భయంతో నిరుద్యోగులు తమ స్వేచ్ఛను కూడా కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.


సీపీఎం నాయకుడు సైదులును ఈడ్చేస్తున్న ఎస్‌ఐ మహేష్

సీపీఎం నాయకుడిని ఈడ్చుకెళ్లిన ఎస్‌ఐ

- ఇళ్ల పంపిణీలో అవకతవకలు జరిగాయని సీపీఎం ఆందోళన
- ఆందోళనకారులను ఈడ్చిపడేసిన ఎస్‌ఐ

మోతె: సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని విభళాపురం గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ శుక్రవారం పలువురు లబ్ధిదారులతో పాటు సీపీఎం నాయకులు ఆందోళన చేశారు. డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్ద దారికి అడ్డంగా ముళ్లకంచె వేసి ధర్నా చేశారు. అక్కడికి చేరుకున్న స్థానిక ఎస్‌ఐ మహేష్ ఆందోళనకారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న జిల్లా సీపీఎం నాయకుడు సైదులును ముళ్లకంచె మీదుగా ఈడ్చేశాడు. ఈ క్రమంలో లబ్ధిదారులు ఎస్‌ఐని అడ్డుకునే క్రమంలో వారితో కూడా దురుసుగా ప్రవర్తించారు. ఎస్‌ఐ తీరుపై సర్వత్రా నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులతో పాటు పలు పార్టీలకు చెందిన నాయకులు ఖండించారు.

వేసవి శిబిరాలు.. భవితకు బాటలు

- యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న క్రీడా శిక్షణ
- 10 గ్రామీణ, 13 అర్బన్ ప్రాంతాల్లో ఏర్పాట్లు
- ఉత్సాహంగా హాజరవుతున్న చిన్నారులు


స్టేడియంలో అథ్లెటిక్స్ శిబిరం


మహబూబ్‌నగర్‌లోని ప్రధాన స్టేడియంలో వేసవి బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరం

మహబూబ్‌నగర్ క్రీడలు: వేసవి క్రీడా శిబిరాలు చిన్నారుల భవితకు బాటలు వేస్తున్నాయి. చాలా మంది చిన్నారుల నైపుణ్యం వేసవి శిక్షణ శిబిరాల ద్వారానే బయటికి వస్తుందనడంలో అతిశయోక్తి లేదు. ఈ క్రమంలో జిల్లావ్యాప్తంగా ఈ నెల 1 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. దీంతో చిన్నారులు, యువత ఆయా శిబిరాల్లో ఉత్సాహంగా చేరుతున్నారు. చిన్నారులతో వేసవి క్రీడా శిబిరాలు కిటకిటలాడుతున్నాయి.

శాట్ ఆదేశాల మేరకు..

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) ఆదేశాల మేరకు జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో ఈ ఏడాది జిల్లాలోని గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 10, అర్బన్‌లో 13 చోట్ల శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే నిర్వాహకులకు క్రీడా సామగ్రి అందజేయగా.. ఈ నెలాఖరు వరకు నిర్వహించనున్నారు. జిల్లాలోని 23 వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో వేలాది మంది చిన్నారులు, యువత శిక్షణ తీసుకుంటున్నారు.

మెయిన్ స్టేడియంలో కిటకిట..

జిల్లాకేంద్రంలోని ప్రధాన స్టేడియంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు కిటకిటలాడుతున్నాయి. స్టేడియంలో అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, చెస్, ఆర్చరీ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో వందలాది మంది విద్యార్థులు శిక్షణ తీసుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ ఇస్తున్నారు. అదేవిధంగా జిల్లాలోని పలువురు కరాటే మాస్టర్లు ఈ ఏడాది పలుచోట్ల వేసవి కరాటే శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారు. జిల్లాకేంద్రంలో అధిక సంఖ్యలో వేసవి కరాటే శిక్షణ శిబిరాలు నిర్వహిస్తుండడం విశేషం. వేసవి తైక్వాండో శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను డీవైఎస్‌ఓ ఎస్.శ్రీనివాస్ పరిశీలిస్తున్నారు. శిబిరాల నిర్వహణపై కోచ్‌లకు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

చాలా బాగుంది..



ఈ ఏడాది మొదటిసారిగా వేసవి వాలీబాల్ శిబిరంలో శిక్షణ తీసుకుంటున్న. కోచ్ పర్వేజ్‌పాషా చాలా చక్కగా శిక్షణ ఇస్తున్నారు. ఎత్తుగా ఉండడం వల్ల చాలా మంది సూచన మేరకు వాలీబాల్ క్రీడను ఎంచుకున్న. వేసవి వరకు పరిమితం కాకుండా రెగ్యులర్‌గా వాలీబాల్ శిక్షణ తీసుకుంటా. సరీ్వస్ చేయడం ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్న. పెద్దయ్యాక మంచి వాలీబాల్ క్రీడాకారుడినవుతా.

– రియాన్, మహబూబ్‌నగర్

స్పోర్ట్స్ స్కూల్ లక్ష్యం..



ఈ ఏడాది వేసవి అథ్లెటిక్స్‌లో శిక్షణ తీసుకుంటున్న. మంచిగా స్పోర్ట్స్ స్కూల్‌లో సీటు వస్తుందని అనుకుంటున్న. ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో రెగ్యులర్‌గా ట్రైనింగ్ తీసుకుంటున్న.

– అక్షయ్, మహబూబ్‌నగర్

బాస్కెట్‌బాల్ అంటే ఇష్టం..



బాస్కెట్‌బాల్ ఆడడం అంటే ఎంతో ఇష్టం. అందుకే ఈ సమ్మర్ క్యాంప్‌లో బాస్కెట్‌బాల్ కోచింగ్ తీసుకుంటున్న. డ్రిబ్లింగ్ చేయడం నేర్చుకుంటున్న. ప్రతిరోజు గ్రౌండ్‌కు మార్నింగ్ వస్తున్న. ఖలీల్ సార్ మంచి శిక్షణ ఇస్తున్నారు. ఇకపై ప్రతిరోజు బాస్కెట్‌బాల్ శిక్షణ తీసుకుంటా.

– హిమజ, మహబూబ్‌నగర్

వెలుగులోకి ప్రతిభగల క్రీడాకారులు



ఈ ఏడాది జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో 23 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాం. వేలాది మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. వేసవి శిక్షణ శిబిరాలతో ప్రతిభగల క్రీడాకారులు వెలుగులోకి వస్తారు. వేసవి శిబిరాల వరకు కాకుండా రెగ్యులర్‌గా క్రీడా శిక్షణ తీసుకుంటే మేటి క్రీడాకారులుగా ఎదుగుతారు.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌ఓ, మహబూబ్‌నగర్

కాంగ్రెస్ నేతలవి పగటి కలలు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: 'ప్రత్యామ్నాయం లేక గట్టెక్కిన కర్ణాటక కాంగ్రెస్ ఫలితాలను చూసుకొని తెలంగాణ కాంగ్రెస్ నేతలు అధికారం కోసం పగటి కలలు కంటున్నారు' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం వనపర్తి జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జడ్చర్ల సభావేదికగా కాంగ్రెస్ నేతలు చేసిన విమర్శలకు కౌంటర్ ఇస్తూ పలు వీడియోలను వాట్సప్ గ్రూప్‌లలో విడుదల చేశారు. నాలుగున్నర దశాబ్దాల పాటు ఏకధాటిగా పాలించిన కాంగ్రెస్‌తో పాలమూరు జిల్లాకు మిగిలింది తాగు, సాగునీటి కష్టాలు, బతుకు జీవుడా అని వలస వెళ్లే దీనస్థితి అని ఎద్దేవా చేశారు. పెండింగ్ అనే పదానికి పర్యాయపదంగా పాలన చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు అధికారం కోసం యాత్రలు, సభల పేరుతో ప్రజల నమ్మకాన్ని చూరగొనలేరన్నారు. 2014 నుంచి నాలుగున్నరేళ్ల కేసీఆర్ పాలన చూసి 2018 ఎన్నికల్లో ఉమ్మడి పాలమూరులోని 14 అసెంబ్లీ స్థానాలకు 13 చోట్ల గెలిపించి ప్రజలు పట్టం కట్టారని గుర్తుచేశారు. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని అడ్డుకునేందుకు కేసులు వేసింది కాంగ్రెస్ నేతలే అని ఆరోపించారు. తొమ్మిదేళ్లలో పాలమూరు వ్యవసాయరంగ స్వరూపం మారిపోయిందని, ఇందుకు నడి ఎండాకాలంలో చెరువుల్లో ఉన్న నీరే సాక్ష్యం అన్నారు.

ముంబాయి తరలిన ఎండీసీఏ క్రికెట్ జట్టు


టీ- 20 మ్యాచుల్లో పాల్గొనే జిల్లా క్రికెట్ జట్టు

మహబూబ్‌నగర్ క్రీడలు: ముంబాయిలో శనివారం నుంచి రెండు రోజులపాటు జరిగే టీ–20 క్రికెట్ మ్యాచుల్లో పాల్గొనడానికి ఎండీసీఏ క్రికెట్ జట్టు తరలివెళ్లినట్లు మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.రాజశేఖర్ తెలిపారు. కోటక్ మహీంద్ర బ్యాంక్ జనరల్ మేనేజర్ సుధాకర్ సహకారంతో జరిగే రెండు టీ–20 మ్యాచ్‌ల్లో జిల్లా క్రికెట్ జట్టు ముంబాయిలోని స్థానిక జట్లతో ఆడుతుందన్నారు. టీ- 20 మ్యాచుల్లో జిల్లా క్రికెట్ జట్టు ప్రతిభచాటాలని కోరారు. ఈ మ్యాచుల్లో రాణించేవారికి భవిష్యత్‌లో మెరుగైన అవకాశాలు లభిస్తాయని ఆకాంక్షించారు.

ఎండీసీఏ క్రికెట్ జట్టు..

ఆబిద్ హుస్సేన్, హర్షవర్ధన్, ఎండీ అద్నాన్, డేవిడ్, గణేష్, పవన్‌కుమార్, ఎండీ ముఖీద్, అభి, శ్రీకాంత్, ఖయ్యూం, అరుణ్‌కుమార్, సాహిల్, షాదాబ్, యువన్, కె.కిషోర్, అరవింద్, జి.పవన్, ఆదిత్య, కె.శివశంకర్, సత్యప్రకాశ్ ఉన్నారు.

భారీగా నకిలీ పత్తివిత్తనాల పట్టివేత

- 3,068 కేజీల దూది పత్తివిత్తనాల పట్టివేత
- టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు
- కేసు నమోదుపై ఉత్కంఠ


పట్టుబడిన పత్తివిత్తనాలను పరిశీలిస్తున్న వ్యవసాయ, పోలీసులు అధికారులు

మల్దకల్: అక్రమంగా నిల్వ ఉంచిన నకిలీ పత్తి విత్తనాలను మూడు గ్రామాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఆ వివరాలు... మల్లెందొడ్డి గ్రామానికి చెందిన సీడ్ ఆర్గనైజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, బిజ్వారం గ్రామానికి చెందిన సీడ్ ఆర్గనైజర్ క్రిష్టయ్య దగ్గర నిల్వ ఉంచిన నకిలీ పత్తి విత్తనాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. సీడ్ ఆర్గనైజర్లు రైతులకు పత్తి పంట సాగు నిమిత్తం వినోత్పత్తి విత్తనాలను రైతులకు అందజేశారు. పంటలను సాగు చేసిన రైతులు పండించిన పంటను మిల్లులో జిన్నింగ్ ఆడించిన అదే కంపెనీకి శ్యాంపిల్స్ సేకరించిన అనంతరం విత్తనాలను అప్పగించారు. అయితే ఇందులో ఫెయిల్ అయిన విత్తనాలను కంపెనీ నిర్వాహకులు వాటిని తిరిగి సీడ్ ఆర్గనైజర్లకు అప్పగించారు. అయితే ఫెయిల్ పత్తివిత్తనాలకు సంబంధించి ఎలాంటి అనుమతులు లేకుండానే ఆర్గనైజర్లు వాటిని నిల్వ ఉంచుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీడ్ ఆర్గనైజర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణయ్య నుంచి విత్తనాలను స్వాధీనం చేసుకుని, పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ విషయాన్ని జిల్లా వ్యవసాయ అధికారులకు తెలిపారు. వ్యవసాయ అధికారులు స్టేషన్‌లోని విత్తనాలను పరిశీలించారు. మొత్తం 3,068 కేజీల(58 బస్తాలు) నకిలీ పత్తి విత్తనాలను పరిశీలించి, ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వారి ఆదేశాల మేరకు చర్యలుంటాయని ఏఓ రాజశేఖర్, ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

నల్లమల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు


వైద్యాధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాలరాజు

అచ్చంపేట రూరల్: నల్లమల ప్రాంత ప్రజలకు త్వరలోనే మెరుగైన వైద్య సేవలు అందనున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైద్య విధాన పరిషత్ అధికారులు, డీఎంహెచ్‌ఓతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈనెల 29న అచ్చంపేటలో నూతనంగా నిర్మించిన 100 పడకల ఆసుపత్రిని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభించనున్నామని, అందుకు తగిన ఏర్పాట్లను అధికార యంత్రాంగం చేపట్టాలని ఆదేశించారు. నల్లమల ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరనుందని, ఆసుపత్రిలో అన్ని వైద్య సేవలు అందనున్నాయన్నారు. అన్ని ఎమర్జెన్సీ కేసులతో పాటు అధునాతన యంత్రాలతో వైద్య సేవలు అందించనున్నారన్నారు. నల్లమల ప్రాంతంలో చెంచు, గిరిజన, బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేద ప్రజలే ఉన్నారని, వారికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తారాసింగ్, మండల రైతు బంధు సమితి అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్ అర్హత పరీక్ష ఫలితాలు విడుదల

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మహబూబ్‌నగర్‌లోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్స్, ఎస్సెస్సీ, రైల్వేలకు సంబంధించి ఫౌండేషన్ కోర్సులో ఉచిత కోచింగ్ ఇచ్చేందుకు నిర్వహించిన అర్హత పరీక్ష ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు ఎస్సీ సంక్షేమశాఖ అధికారి పాండు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష రాసిన వారు ఎస్సీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో ఫలితాలు అందుబాటు ఉన్నాయని, ఎంపికైన వారు ఈ నెల 29, 30, 31వ తేదీల్లో ఎస్సీ స్టడీ సర్కిల్‌లో రిపోర్టు చేయాలని సూచించారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి స్వల్ప ఇన్‌ఫ్లో కొనసాగుతుందని పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1,219 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందన్నారు. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.645 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్టు నుంచి 154 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు.